సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



పొట్ట కొట్టారు..

జీఆర్‌పీయూలో 34 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీసేశారు. రాజకీయ కక్ష కనిపిస్తోంది.

- 8లో



జీఎస్టీ ఆఫీసర్లమంటూ..

జీఎస్టీ ఆఫీసర్లమంటూ ముగ్గురు టోకరా వేశారు. రూ.2 లక్షలు కాజేశారు.

- 8లో

'సీక్రెట్ సర్వీస్'పై విచారణకు కలెక్టర్ ఆదేశం

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల కౌన్సెలింగ్ ప్రక్రియలో 'సీక్రెట్ సర్వీస్ లిస్ట్' వ్యవహారంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించినట్లుగా తెలిసింది. కార్యాలయ పరిపాలనాధికారి బాబూరావు అసంతృప్తి వెనుక జరిగిన వ్యవహారమేంటో తేల్చాలని అధికారులకు ఆదేశించినట్లు సమాచారం.

న్యూస్‌రీల్

ఆర్‌జీయూకేటీ క్లాస్‌వర్క్ ప్రారంభం



తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) క్లాస్‌వర్క్ గురువారం ప్రారంభమైంది. మొదటి ఏడాది ప్రస్తుతం 820 మంది విద్యార్థులు రిపోర్టు చేశారు. క్యాంపస్ ట్రాన్స్‌ఫర్, ప్రత్యేక కేటగిరి ప్రవేశాలు వంటి ప్రక్రియ పూర్తయ్యాక పూర్తిస్థాయి ప్రవేశాలకు అవకాశం ఉంది. పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ చౌదరి పర్యవేక్షించారు.

కాంబోడియా వెళ్లేందుకు ప్రయత్నించిన యువకుడి అరెస్ట్

విశాఖ సిటీ: కాంబోడియాలో చైనా ముఠా గ్యాంగ్ చేతిలో చిక్కుకున్న వారిని సురక్షితంగా విశాఖకు తీసుకువచ్చిన వారిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక యువకుడు తిరిగి సైబర్ నేరాలు చేయడానికి కాంబోడియా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేశారు. విదేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగం పేరిట కొందరు నిరుద్యోగులను కాంబోడియాకు తీసుకెళ్లి, బలవంతంగా వారితో సైబర్ నేరాలు చేయిస్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి బాధితులను చైనా గ్యాంగ్ చెర నుంచి విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు విడిపించి, సురక్షితంగా తీసుకొచ్చారు. వీరిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అరుగుల రిషి రాజ్(20) తిరిగి సైబర్ నేరాల ద్వారా భారతీయులను మోసం చేసి డబ్బు సంపాదించేందుకు కాంబోడియా వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. నేరుగా కాంబోడియాకు వెళితే పోలీసులు గుర్తించే అవకాశం ఉందని భావించి, వియత్నాంకు హాలిడే కోసం వెళ్తున్నట్లు విజిటింగ్ వీసా తీసుకున్నాడు. ఈ నెల 12న విశాఖ నుంచి ఢిల్లీకి వెళ్లాడు. 15న ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్‌కు వెళ్లగా అతడిపై విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు జారీ చేసి లుక్‌అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ)ని గుర్తించి నిలువరించారు. ఆ విషయాన్ని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించగా.. అతడిని పోలీసులు అరెస్టు చేశారు.

గురువారం రాత్రి 10.30 రిమ్స్ క్యాజువాలిటీ వార్డులో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్య సిబ్బంది





హాస్పిటల్ సేఫేనా..!

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళా వైద్య సిబ్బంది రక్షణ ప్రశ్నార్థకమే
- ఆందోళనలో మహిళా వైద్యులు
- కోల్‌కతా ఘటనతో అప్రమత్తమైన రిమ్స్ ఆస్పత్రి అధికారులు
- కలెక్టర్ జోక్యంతో యుద్ధ ప్రాతిపదికన రక్షణ చర్యలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కోల్‌కతాలో ఓ జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశం మొత్తాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆస్పత్రుల్లో మహిళావైద్యుల భద్రతపై ప్రశ్నలను లేవనెత్తింది. భద్రత సరే సదుపాయాలైనా ఉన్నాయా.. అనే అనుమానాలూ రేకెత్తించింది. ఈ నేపథ్యంలో గురువారం జిల్లాకేంద్రంలో ఉన్న రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిని 'సాక్షి' విజిట్ చేసింది. ఈ విజిట్‌లో అనేక లోపాలు కనిపించాయి. తీవ్ర భయాందోళనలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పరిస్థితి దయనీయంగా ఉంది. తమ పేర్లు, ఫొటోలు ప్రచురించవద్దని అంటూనే వారికున్న భయం, నైట్ డ్యూటీ సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.



పని గంటల్లో ఒత్తిడి..

రిమ్స్‌లో చూసుకుంటే నైట్ డ్యూటీ మధ్యాహ్నం 2 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9గంటల వరకు ఉండాలి. ఎవరైతే నైట్ డ్యూటీ చేస్తారో వాళ్లే డ్యూటీకి కూడా రావాలి. అంటే ఉదయం 9 గంటలకు రావాల్సి ఉంది. అంటే డ్యూటీ డాక్టర్ ఉదయం 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9గంటల వరకు విధులు నిర్వర్తించాలి. దీంతో మహిళా వైద్యులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

ఎంఎల్‌సీలకే ఔట్‌పోస్టు పరిమితమా..?

చిన్న చిన్న ప్రమాద కేసులు వచ్చినప్పుడు కొంతమంది బయట వ్యక్తులు వచ్చి కావాలనే గొడవలు చేస్తూ.. అక్కడ ఉన్న మహిళా వైద్యులు, సిబ్బంది ఫొటోలు తీయడం, వీడియోలు తీయడం చేస్తుంటారు. అలాంటప్పుడు పక్కనే ఉన్న ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చినా.. మా పని అది కాదు. పరిధిలో ఉన్న టూటౌన్ పోలీసులకు సమాచారమివ్వాలని, లేదంటే ఫిర్యాదు చేయాలని ఔట్ పోస్టు సిబ్బంది తప్పించుకుంటున్నారు. ఉన్న వారు కూడా యూనిఫాం లేకుండా కనిపించడంతో మహిళా వైద్యులకు భయం తప్పడం లేదు.

కలెక్టర్ ఆదేశాలతో సీసీ కెమెరాల కంట్రోల్



ఆస్పత్రిలో 118 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇందులో ఎన్‌ఎంసీ పెట్టినవి ఏడు (ఓపీ, క్యాజువాలిటీ, ఎస్‌ఐసీయు, ఎంఎస్‌వో) ఉన్నాయి. ఏజెన్సీ పెట్టినవి 80 వరకున్నాయి. వీటి కమాండ్ కంట్రోల్ రూం పై ఫ్లోర్‌లో ఉండటం, వాటిని పర్యవేక్షించాల్సిన సిబ్బంది ఇటీవల వరకు లేరు. ఇటీవల కలెక్టర్ జోక్యం చేసుకుని పై ఫ్లోర్‌లో ఉన్న ఉన్న కంట్రోల్ రూమ్‌ను కింద ఫ్లోర్‌లో పెట్టాలని సూచించారు. దీనికి ఉదయం పూట సెక్యూరిటీ గార్డు, రాత్రి పూట సూపర్‌వైజర్ దగ్గరుండి తప్పక పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఫ్యాకల్టీ రూమ్‌ల్లో విచిత్ర పరిస్థితి

ఆస్పత్రిలో 92 ఫ్యాకల్టీ డ్యూటీ రూమ్‌లు ఉన్నాయి. ఇక్కడ కూడా నైట్ డ్యూటీ చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా లేబర్ రూమ్, మెడిసిన్,ఎం.ఎం.వార్డు, ఎస్ఐసీయూ తదితర డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిన్నింటికీ 92 రూమ్‌లిచ్చినా వాటిలో 28 రూమ్‌లకు వాష్ రూముల్లేవు.

కోల్‌కతా ఘటనతో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ..

కోల్‌కతా ఘటన నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రిమ్స్‌తో పాటు జిల్లాలో ఉన్న ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇప్పటికే రిమ్స్ అధికారులతో సమీక్షలు చేశారు. సెక్యూరిటీ పెంచాలని, సీసీ కంట్రోల్ రూం కిందకు మార్చాలని, సెక్యూరిటీ, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని, సెక్యూరిటీ సిబ్బంది రాత్రి బీట్లు మరింత అప్రమత్తంగా ఉండేలా చూడాలని, ఫీమేల్ వాష్‌రూం దగ్గర సెక్యూరిటీ ఉండేలా చూడాలని, సీసీ కెమెరాలు పెంచాలని ఆదేశించారు. విద్యార్థినుల హాస్టళ్లలో ఎక్కువ లైట్లు ఉండేలా చూడాలని, పెద్ద లాంతరు ఒకటి ఏర్పాటు చేయాలని సూచించారు.

సరిపడని సెక్యూరిటీ..



రిమ్స్ సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఎంవో

ఆస్పత్రిలో ప్రస్తుతం 850 బెడ్స్‌కున్న నార్మ్స్ బట్టి 130 మంది సెక్యూరిటీ ఉన్నారు. కానీ ఇక్కడ 950 బెడ్స్ ఉన్నాయి. అంటే మరో 30 మంది వరకు సెక్యూరిటీ అవసరముంది. వీరిలో కళాశాలకు 26 మంది సెక్యూరిటీ ఉండగా మిగతా వారు ఆస్పత్రిలో విధులు నిర్వర్తిసున్నారు. ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ ఏమాత్రం సరిపోదు. తక్షణం పెంచాల్సిన అవసరం ఉంది.

హాస్టల్‌లో అరకొరగా...

మూడు షిఫ్టుల్లో ఫీమేల్ సెక్యూరిటీ ఒక్కొక్కరిగా వస్తారు. కానీ షిఫ్ట్‌కి ఇద్దరు సెక్యూరిటీ అయినా ఉండాలి. వార్డెన్‌గా నియమితులైన వారికి అక్కడే స్టే ఉండేలా క్వార్టర్స్ లేవు. దీంతో వార్డెన్ అప్పుడప్పుడు వెళ్లే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక్కడ ముఖ్యంగా హౌస్ కీపర్ కంటిన్యూగా ఉండాలి. ఆ పోస్టు లేదు. మహిళా పోలీసు కూడా ఉంటే మంచిది.

క్యాజువాలిటీలో వసతులు కరువు



రెస్ట్ రూమ్‌లో వైద్యుల కోసం కేటాయించిన బెడ్లు

- పీజీ డాక్టర్లు, అసిస్టెంట్ డాక్టర్లు, హౌస్ సర్జన్‌లకు రెస్ట్ రూం ఉంది.
- రాత్రి పూట షిఫ్ట్‌లో హౌస్ సర్జన్లు 14 మంది ఉండగా, పీజీ, జూనియర్ డాక్టర్లు 15 నుంచి 20 మంది వరకు ఉంటారు.
- వీరిలో మహిళా వైద్యులకు ఒక రెస్ట్ రూమ్, మేల్ వైద్యులకు ఒక రెస్ట్ రూమ్ ఉన్నాయి.
- మహిళా రెస్ట్ రూమ్‌లో నాలుగు బెడ్లు, మేల్ రెస్ట్ రూమ్‌లో నాలుగు బెడ్లు మాత్రమే ఉన్నాయి.
- దీన్ని బట్టి నైట్ డ్యూటీలో వైద్యులు ఎంత ఇబ్బంది పడతున్నారో అర్థం చేసుకోవచ్చు.
- ఈ లెక్కన కొందరు వైద్యులు రెస్ట్ రూమ్‌లో కాకుండా బయటే ఉండాల్సి వస్తుంది.
- టాయిలెట్లు కూడా సరిపడా లేవు. మహిళా వైద్యుల రెస్ట్ రూమ్‌లో మాత్రమే వాష్ రూమ్ లున్నాయి. దాదాపు 34మందికి గాను నాలుగే వాష్ రూమ్‌లు ఉన్నాయి.
- మహిళా వైద్యులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే వాష్ రూమ్‌లు పెంచాలి.
- బెడ్లు కూడా 20 వరకు పెంచాలి.

మహిళా వైద్యుల భద్రతపై అప్రమత్తం



నైట్ రౌండ్లలో వైద్య విద్యార్థుల హాస్టళ్లను, కళాశాలను పరిశీలించడానికి వెళ్లేటప్పుడు రెండు మూడు చోట్ల లైట్లు వెలగక చీకటిగా ఉండటం చూశాను. ప్రతిపాదనల మేరకు ఏపీఐఎండీసీ 20 లైట్లు మంజూరు చేశారు. ఇప్పటికే 10 బిగించారు. విద్యార్థినులు సింగిల్‌గా రాత్రి సమయాల్లో వెళ్లేటప్పుడు విజుబుల్‌గా ఉండటానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నైట్‌డ్యూటీ చేసేటప్పుడు అదనంగా వాష్‌రూంలు తెరిపించాం. ఫుడ్ కోసం రాత్రి ఆలస్య సమయాల్లో బయటకు అమ్మాయిలు వెళ్లకుండా డైట్ క్యాంటీన్ వాళ్లకు డ్యూటీరూమ్‌కే అందించేలా ఏర్పాటు చేశాం. – దాసరి షకీలా, సూపరింటెండెంట్, రిమ్స్ ఆసుపత్రి.

భద్రతపై ప్రత్యేక దృష్టి



డ్యూటీ రూమ్‌లు పెంచుతాం. అవసరం మేరకు హెచ్‌డీఓ, అసిస్టెంట్ల రూమ్‌లు ఇస్తున్నాం. వాష్‌రూంలు 4, 5 వరకు పెంచుతాం. అదనంగా ప్రైవేటు సెక్యూరిటీ పెంచే యోచనలో ఉన్నాం. రెగ్యులర్‌గా నైట్ రౌండ్లు వేస్తాం. ఔట్‌పోస్టు పోలీసులు రక్షణగా ఉండాలి. ముఖ్యంగా పోలీసు శాఖ నుంచి క్యాజువాలిటీ, లేబర్ రూమ్ వద్ద డిప్యుటేషన్‌పై మూడు షిఫ్టుల్లో ముగ్గురు పోలీసులను నియమిస్తే వైద్యులకు కొంత రక్షణ ఉంటుంది.

– వీవీ సుభాషిని, ఆర్ఎంఓ, రిమ్స్

పోలీస్ ఎస్కార్ట్ ఉండాలి..



విపరీతమైన కేసులు వచ్చేటప్పుడు ఒత్తిడి తప్పదు. కొన్ని ప్రమాద కేసులు వచ్చేటప్పుడు రోగి అటెండర్లు కాకుండా బయట వ్యక్తులు గుంపుగా వచ్చి కావాలనే గొడవ పడతారు. కొంతమంది ఫొటోలు, వీడియోలు తీసి బెదిరిస్తుంటారు. ఔట్‌పోస్టులో పోలీసులు పరంగా రక్షణ కల్పిస్తే బాగుంటుంది. బెడ్స్, వాష్‌రూమ్స్ పెంచాలి.– డాక్టర్ అనురాధ, క్యాజువాలిటీ విభాగం

దోషులను శిక్షించాలి



పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన ఆటవిక చర్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. నిందితుడికి ఉరిశిక్ష విధించాలి.

– డాక్టర్ ప్రతీక్ష శర్మ, బాతువ పీహెచ్‌సీ, జి.సిగడాం



న్యాయం కావాలి

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ.. రిమ్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

మన ఫ్యాక్టరీల్లోనూ.. డేంజర్ సైరన్

- జిల్లాలో ప్రమాదాలకు అవకాశం ఉండే పరిశ్రమలు 15
- ఇప్పటికే పలుచోట్ల ఘటనలు
- లోపాలను గుర్తించిన ప్రత్యేక కమిటీలు
- అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంతో ఉలిక్కిపడిన జిల్లా ప్రజలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అచ్యుతాపురం ఘటనతో జిల్లా ఉలిక్కి పడింది. అక్కడ ఫార్మా సెజ్‌లోని ఓ కంపెనీలో బుధవారం రియాక్టర్ పేలి విధ్వంసం జరగడంతో.. అందరి దృష్టి మన జిల్లాలో ఉన్న పరిశ్రమలపై పడింది. మన వద్ద అన్ని కర్మాగారాల్లో భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా..? కార్మికుల ప్రాణాలు భద్రమేనా..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. జిల్లాలో 17 వరకు ఫార్మా కంపెనీలు ఉన్నాయి. వాటిలో 15 అత్యంత ప్రమాదకర, ప్రమాదకర పరిశ్రమలు ఉన్నాయి.

ఎనిమిదేళ్ల కాలంలో 12 మంది మృతి


ప్రతి ఫార్మా కంపెనీలోనూ నిబంధనల ప్రకారం అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేయాలి. వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. ఏ మాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా ముప్పు తప్పదు. జిల్లాలో ఉన్న ఫార్మా కంపెనీల్లో 2016–19 మధ్య ఐదు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందగా, 2019–2023 మధ్య మూడు ప్రమాదాలు జరిగి ఇద్దరు దుర్మరణం చెందారు. 2024 జూలైలో ఒక ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెందారు. ఎనిమిదేళ్ల కాలంలో 12 మంది వివిధ ప్రమాదాల్లో కన్నుమూశారు. తరచూ రియాక్టర్లు పేలిన ఘటనలే ఎక్కువగా ఉంటున్నాయి. తాజాగా ఈ ఏడాది జూన్ 29న సరకా ల్యాబ్‌రేటరీస్ పరిశ్రమలోని రసాయనాలకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మధ్యాహ్న భోజన సమయం కావడంతో ప్రాణ నష్టం జరగక పోయిన కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగింది. జూలై 2న శ్రేయాస్ పరిశ్రమలోని స్టాక్ యార్డ్ రేకులు విరగడం వల్ల ఇద్దరు కార్మికులు జారి పడి మృతి చెందారు.



పైడిభీమవరం పారిశ్రామిక వాడలోని ల్యాబొరేటరీలో ప్రమాద దృశ్యం

లోపాలు గుర్తించారు..

విశాఖలోని ఎల్జీ పాలిమర్స్ ప్రమాద ఘటన తర్వాత అప్పటి కలెక్టర్ జె.నివాస్ చొరవ తీసుకుని జిల్లాలో ఉన్న పరిశ్రమలను తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దాని కోసం ప్రత్యేక కమిటీని వేశారు. కమిటీలో అప్పట్లో పనిచేసిన జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ బి.గోపాలకృష్ణ, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్ నాయక్ ఇన్‌చార్జి జిల్లా అగ్నిమాపక అధికారి బీజేడీ ప్రసన్నకుమార్, ఏపీఐఐసీ అధికారి బి.హరినాధరావు, ఏసీఎల్ వై.శైలేష్‌కుమార్ తదితరులను సభ్యులుగా నియమించారు. కలెక్టర్ ఆదేశించడమే తరువాయి కమిటీ సభ్యులు జిల్లాలో ఉన్న రసాయన పరిశ్రమలను హుటాహుటీన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా పరిశ్రమల భద్రత, సురక్షిత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో 12 యూనిట్లలో లోపాలను గుర్తించారు. తదనుగుణంగా కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. దాంట్లో రియాక్టర్ల సామర్థ్యం, వాటి పనితీరుపై పలు సందేహాలను వ్యక్తం చేశారు. అంతేకాకుండా రియాక్టర్ల ఆపరేటర్ల వద్ద మాత్రమే అలారం సిస్టమ్స్ ఉండటం, కంట్రోల్ ఆఫీసుల వద్ద అలారం సిస్టమ్ లేకపోవడం, రియాక్టర్ల వద్ద ఉష్ణోగ్రత పెరిగేటప్పుడు ఆటోమెటిక్‌గా కూల్ చేసే సిస్టమ్ లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు. వీటిన్నింటిని ఆ కమిటీ నివేదికలో ప్రస్తావించడమే కాకుండా సరిచేసుకోవాలని కంపెనీలకు నోటీసులు ఇచ్చారు.





2022లోనూ తనిఖీ

2022లో కూడా ఇదే రకంగా జిల్లా పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా అగ్నిమాపక శాఖల అధికారులతో వేసిన కమిటీ కూడా ఫార్మా కంపెనీల్లో తనిఖీలు చేసింది. ఈ సందర్భంలో కూడా రియాక్టర్లు, డ్రయ్యర్స్, సెంట్రిఫ్యూజ్ లోపాలను గుర్తించారు. వాటిని సరిచేసుకోవాలని, సాల్వెంట్ లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండేళ్ల వ్యవధిలో రెండు సార్లు ప్రత్యేక కమిటీలు తనిఖీ చేసి, లోపాల నివేదిక ఇచ్చినప్పటికీ అక్కడక్కడా ప్రమాదాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు

ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ఏ పరిశ్రమలోనైనా సక్రమంగా భద్రత చర్యలు చేపట్టకుంటే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. మాక్‌డ్రిల్ వంటి కార్యక్రమాలు ప్రతి నెలా నిర్వహిస్తున్నాం. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నాం. – బి.రాంబాబు, కర్మాగారాల ఉపముఖ్య తనిఖీ అధికారి, శ్రీకాకుళం జిల్లా

జిల్లాలో ఫార్మా కంపెనీలు	ప్రమాదకరమైనవి	ఎనిమిదేళ్లకాలంలో జరిగిన ప్రమాదాల సంఖ్య	మృతులు	లోపాలను గుర్తించిన యూనిట్లు
17	15	09	12	12

ఆ బిడ్డకు చెప్పేదెలా..



హంస ప్రశాంత్ భార్య, పిల్లలు

పొందూరు: మూడేళ్ల కూతురు నాన్న కోసం ఎదురు చూస్తూ ఉంది. నాన్న ఇక రాడని ఆ బిడ్డకు చెప్పేదెలా..? ఇంకా పేరు పెట్టని చిన్నారి తండ్రి స్పర్శ కోసం ఎదురుచూస్తోంది. తండ్రి మరి లేడని ఆ చిన్నారికి చెప్పేదెలా..? అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న పొందూరుకు చెందిన హంస ప్రశాంత్(36) మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఆయనకు భార్య జ్యోతి, తల్లి సత్యవతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం అచ్యుతాపురం ఫార్మాసెజ్‌లో విధులు నిర్వహిస్తుండగా జరిగిన ఘోర ప్రమాదంలో ప్రశాంత్ దుర్మరణం పాలయ్యాడు. అతని మరణ వార్త తెలిసి తల్లి, భార్య ఇక్కడ కుప్పకూలిపోయారు. తండ్రి కోసం ఎదురుచూస్తున్న మూడేళ్ల కుమార్తెకు ఏం చెప్పాలో తెలీక కుటుంబమంతా తల్లడిల్లిపోతోంది. చిన్న కుమార్తెకు మరికొద్ది రోజుల్లో పేరు పెట్టాల్సి ఉంది. ఆ సంబరాన్ని ఘనంగా చేద్దామని చెప్పిన ప్రశాంత్ ఇప్పుడు లోకం విడిచి వెళ్లిపోవడంతో ఆ కుటుంబంలో శోకం అలముకుంది. బుధవారం చనిపోయిన ప్రశాంత్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు రాగా.. ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. బాధితులను పరామర్శించేందుకు అచ్యుతాపురం సెజ్‌కు వచ్చిన సీఎం చంద్రబాబు వద్ద ప్రశాంత్ తల్లి సత్యవతి కన్నీటి పర్యంతమయ్యారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తన కోడలు, మనుమరాళ్లు పెద్ద దిక్కును కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగంలో చేరిన నెలకు..



పైడి రాజశేఖర్ (ఫైల్)

ఆమదాలవలస: అచ్యుతాపురంలో ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే తల్లిదండ్రులు ఆదరాబాదరాగా అక్కడకు వెళ్లారు. అప్పటికే ఆ యువకుడు చనిపోయాడని తల్లిదండ్రులతో పాటు వెళ్లినవారందరికీ తెలుసు. చెబితే ఏమైపోతారో అని వారికి చెప్పలేదు. కొడుకు బతికే ఉంటాడని గంపెడాశతో వెళ్లిన వారికి అతడి మృతదేహం కనిపించడంతో హతాశులైపోయారు. రియాక్టర్ పేలిన ఘటనలో ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్(23) మృతి చెందాడు. ధర్మారావు, తులసమ్మల కుమారుడైన రాజశేఖర్ ఉద్యోగంలో చేరి నెల రోజులే అయ్యింది. జూలై 15న రాజశేఖర్ ఉద్యోగంలో చేరాడు. నాలుగు రోజుల కిందట గ్రామానికి వచ్చి అందరితో సంతోషంగా గడిపాడు. ఇంతలోనే ఇలా జరిగింది. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే గ్రామస్తులు తల్లిదండ్రులకు విషయం చెప్పలేదు. వారిని వెంటబెట్టుకుని విశాఖ వెళ్లారు. అక్కడ నిజం తెలియడంతో వారు గుండెలవిసేలా రోదించారు. ఒక్కగానొక్క కొడుకు ఉద్యోగం చేసి ఆదుకుంటాడు అనుకుంటే.. అర్ధంతరంగా దేవుడు తీసుకుపోయాడని కన్నీరుమున్నీరయ్యారు. గురువారం విశాఖపట్నంలో రాజశేఖర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత అంత్యక్రియల కోసం గ్రామానికి తీసుకువచ్చారని వంజంగి సర్పంచ్ ఎండ అప్పలనాయుడు తెలిపారు.



క్లుప్తంగా

హమ్మయ్య.. లైట్లు వెలిగాయి



పైడిభీమవరంలో ఫ్లై ఓవర్‌పై వెలిగిన విద్యుత్ దీపాలు

రణస్థలం: జిల్లాలోని జాతీయ రహదారిపై పలు చోట్ల విద్యుత్ దీపాలు లేవంటూ 'సాక్షి' ప్రచురించిన 'లైట్ తీసుకుంటున్నారా' కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారి అధికారులు పైడిభీమవరంలో విద్యుత్ దీపాలకు గురువారం మరమ్మతులు చేశారు. దీనిపై స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

28న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని జెడ్పీ సీఈఓ డి.వెంకటేశ్వరరావు తెలియజేశారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రధాన ప్రభుత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలతో పాటు కీలక సమాచారాలతో ఉన్నతాధికారులే హాజరుకావాలని ఆదేశించారు.

ఎస్పీని కలిసిన సీఐలు

శ్రీకాకుళం క్రైమ్ : బదిలీల్లో భాగంగా జిల్లాలోని ఆమదాలవలస, టెక్కలి అర్బన్ పోలీస్ స్టేషన్ల సీఐలుగా వచ్చిన పి.సత్యనారాయణ, ఎ.విజయ్‌కుమార్‌లు గురువారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ ఇరువురు సీఐలతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు.

పార్థివ్ శ్రీవత్సల్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



మూడోసారి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన పార్థివ్ శ్రీవత్సల్

ఇచ్ఛాపురం, హిరమండలం: మూడుసార్లు అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించిన పడాల పార్థివ్ శ్రీవత్సల్ సూపర్ టాలెంట్ కిడ్‌గా గుర్తింపు పొందాడు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులైన పడాల అప్పలనాయుడు, గవర లక్ష్మి కుమారుడు పార్థివ్ శ్రీవత్సల్ ఏడేళ్ల వయసులోనే గణితంలోని 1 నుంచి 50 వరకు ఘనమూలాలను 1.36 నిమిషాల్లో, 1 నుంచి 100 వరకు ఘనమూలాలను 4.24 నిమిషాల్లో రాసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో ఇదివరకు రెండుసార్లు తన పేరు నమోదుచేసుకున్నాడు. తాజాగా ప్రపంచ దేశాల జాతీయ జెండాలను 2నిమిషాల 16సెకన్లలో గుర్తించి మూడోసారి తన పేరును ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసుకున్నాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు స్థానికులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇతని స్వగ్రామం హిరమండలంలోని భగీరథపురం.

4.11 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వి.జయరాజ్

కంచిలి: పశువులకు ఈ సీజన్‌లో వ్యాపించే అత్యంత ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నివారణకు ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు టీకాలు వేస్తున్నామని, మొత్తం 4.11 లక్షల డోసులు పశువులకు వేస్తున్నామని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి.జయరాజ్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 221 బృందాలు 400కు పైగా శిబిరాల్లో ఈ టీకాలు వేస్తాయని తెలిపారు. వ్యాక్సిన్లు వేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే గాలికుంటు వ్యాధి సోకిన పశువులు పూర్తిగా ఆరోగ్యాన్ని కోల్పోతాయని, రైతు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఇక దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక వ్యాక్సిన్లను వేస్తున్నామని, వీటిని జిల్లా వ్యాప్తంగా 30,280 డోసులు వేస్తున్నామని తెలిపారు. 4 నుంచి 8 నెలల దూడలకు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించాలని అన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోకపోతే వాటికి గర్భధారణ సమస్యలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. అలాగే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు అఖిల భారత పశుగణాంకాల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జయరాజ్ వెల్లడించారు. ఈ గణన వల్ల ఏ జాతి పశువులు ఏ ప్రాంతంలో ఎన్ని ఉన్నాయన్నది తెలుస్తుందన్నారు.

పొట్ట కొట్టారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

- ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా వేటు
- ఎనిమిది నెలల పాటు పనిచేయించుకొని వేతనం ఇవ్వకుండా తొలగింపు
- ఉద్యోగుల పొట్ట కొట్టిన కూటమి ప్రభుత్వం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వీసీ రజిని, రిజిస్ట్రార్ సుజాత తమ పదవులు కాపాడుకోవటం కోసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్టకొట్టారు. 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించారు. విధులకు హాజరు కావద్దని గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులంతా వీసీని కలవగా.. ఉద్యోగం నుంచి తీసేశారని, ఆందోళనలు చేయవద్దని, పాలక మండలి అనుమతిస్తే కొనసాగిస్తామని నచ్చజెప్పారు. గత వైస్ చాన్స్‌లర్ నిమ్మ వెంకటరావు హయాంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఈ ఏడాది జనవరి 1వ తేదీన నియమించారు. పాలక మండలి అనుమతులతో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఏజీఎస్ ఔట్ సోర్సింగ్ ద్వారా ఈ నియామకాలు చేపట్టారు. విద్యార్హతను బట్టి క్లర్క్, డ్రైవర్, ల్యాబ్ టెక్నీషియన్స్, స్టోర్ కీపర్, సెక్యూరిటీ గార్డ్, ఎలక్ట్రీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ డిజిగ్నేషన్స్‌తో ఉద్యోగాలు ఇచ్చారు. మరో పక్క గతంతో తమ మూడేళ్ల టర్మ్‌లో 80 నాన్ టీ చింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగాలు నియమించిన వీసీలు సైతం ఉన్నారు.

రాజకీయ కక్ష..

ఈ ఉద్యోగుల తొలగింపులో రాజకీయ కక్ష స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం 2019– 2024 మధ్య నియామకాలను తొలగించడంపైనే దృష్టి పెట్టారు. ముందుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను తొలగించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తొలగించమని లేఖ ఇవ్వగా, మంత్రి అచ్చెన్నాయుడు సైతం ముందుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని పిలిపించుకొని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నిబంధనలు మేరకు ఈ నెల చివరిలో పాలక మండలి సమావేశం నిర్వహించి, పాలక మండలి అనుమతులతో తొలగించాలని భావించారు. నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు రెక్టార్ బిడ్డిక అడ్డయ్య, ఎగ్జామినేషన్స్ డీన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్ నియామక ఉత్తర్వులు తీసుకోలేదు. తప్పుడు నివేదిక ఇవ్వలేమని తేల్చి చెప్పి రాత పూర్వకంగా సమాధానం ఇచ్చి తప్పుకున్నారు. పాలక మండలిలో పెట్టి నిబంధనల మేరకు తొలగించే అవకాశం లేకపోవటంతో తమ అధికారాలను వినియోగించి తొలగించటం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 17 యూనివర్సిటీల వీసీలు రాజీనామా చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీని సైతం రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యాలయం నుంచి సైతం ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో పలువురు కూటమి నాయకులను అధికారులు కలిసి తమ పదవులు కాపాడుకునే ప్రయత్నం చేశారు. కానీ తమ పదవులు కాపాడుకునే ప్రయత్నంలో గత ప్రభుత్వంలో నియమితులైన ఉద్యోగులను తొలగించడాన్ని అంతా తప్పు పడుతున్నారు.

8 నెలలు పని చేయించుకున్నారు..



జనవరి ఒకటో తేదీన ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా నియమించారు. నియామక ఉత్తర్వులు ఇచ్చి సంతకాలు చేయించుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియమించారు. గత 8 నెలలుగా వేతనం ఇవ్వలేదు. ఇప్పుడు తొలగించినట్లు చెబుతున్నారు. ఇది ఎంత వరకు న్యాయం. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

– ఎ.రాజ్యలక్ష్మి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

పాలక మండలి అనుమతులతో నియమించారు



అప్పటి వీసీ నిమ్మ వెంకటరావు పాలక మండలి అనుమతితో నియామకాలు చేపట్టారు. కొత్తగా వచ్చిన వీసీ కూడా మాతో పనిచేయించుకున్నారు. వేతనం సైతం ఇవ్వలేదు. ప్రస్తుతం మమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించామంటున్నారు. సమస్య చెప్పుకునే అవకాశం సైతం ఇవ్వటం లేదు.

– ఎ.వెంకటలక్ష్మి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

ముందస్తు సమాచారం లేకుండానే..



ఎనిమిది నెలలుగా పనిచేస్తున్నాం. వేతనం సైతం ఇవ్వలేదు. ఒక్కసారి విధులకు హాజరు కావద్దని అన్నారు. వీసీ దృష్టికి సమస్య తీసుకువెళ్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండని చెబుతున్నారు. ఉద్యోగాలు తొలగించటం అన్యాయం.

– ఎస్.రాజేష్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్టు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ జిల్లా డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు తెలిపారు. గురువారం ఆయన జిల్లాలో ఖాళీలగా ఉన్న పోస్టుల వివరాలను, విధివిధానాలను వెల్లడించారు. జిల్లాలో 16 జనరల్, ఒకేషనల్ సబ్జెక్టుల్లో కలిపి మొత్తం 28 ఖాళీలు ఉన్నట్టు పేర్కొన్నారు.

అర్హతలు ఇవి..

సంబంధిత లాంగ్వేజ్, జనరల్ సబ్జెక్టులకు పీజీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఒకేషనల్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)కు బీఎస్సీ నాలుగేళ్ల నర్సింగ్ కోర్సు, ఓఏ సబ్జెక్టుకు డిగ్రీతోపాటు షార్ట్‌హ్యాండ్, హయ్యర్ టైప్‌రైటింగ్ కలిగి ఉండాలన్నారు. అలాగే ఈఈటీ, ఈటీ, సీఈటీ ఒకేషనల్ సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఏఅండ్‌టీ సబ్జెక్టుకు ఎంకామ్ టాక్సేషన్‌లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా అందజేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఆసక్తి, అర్హత కలిగిన ఔత్సాహిక అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీవీఈఓ తవిటినాయుడు సూచించారు. అలాగే విశ్రాంత లెక్చరర్లు, స్కూల్ అసిస్టెంట్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, వీరికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఇవి..

ఇంగ్లిష్: ప్రభుత్వ జూనియర్ కళాశాల(జీజేసీ) ఆమదాలవలస. **సివిక్స్:** జీజేసీ కింతలి, పొందూరు, ఎల్ఎన్‌పేట. **ఫిజిక్స్:** జీజేసీ పొందూరు, ఎచ్చెర్ల. **మ్యాథ్స్:** జీజేసీ సరుబుజ్జిలి, నివగాం. **ఎకనామిక్స్:** జీజేసీ పాతపట్నం, జీజేసీ శ్రీకాకుళం(బాలికలు). **హిందీ:** జీజేసీ శ్రీకాకుళం(బాలికలు). **బోటనీ:** జీజేసీ శ్రీకాకుళం(బాలురు). **జువాలజీ:** జీజేసీ బూర్జ. **హిస్టరీ:** జీజేసీ ఎచ్చెర్ల. **ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్):** జీజేసీ ఇచ్ఛాపురం(బాలికలు), నరసన్నపేట, టెక్కలి. **ఓఏ(టిడబ్ల్యూఅండ్ఎస్‌హెచ్):** జీజేసీ కింతలి, నౌపడ, కొత్తూరు, మందస. **ఓఏ కామర్స్:** జీజేసీ కోటబొమ్మాళి, కొత్తూరు. **ఈఈటీ:** జీజేసీ పోలాకి, నరసన్నపేట. **ఈటీ:** జీజేసీ పోలాకి. **సీఈటీ:** జీజేసీ శ్రీకాకుళం(బాలురు). **ఏఅండ్‌టీ:** జీజేసీ ఆమదాలవలస.

కాలువలో దిగబడిన పెళ్లి బస్సు



ఒరిగిన ప్రైవేటు ట్రావెల్ బస్సు

నరసన్నపేట: స్థానిక మెయిన్ రోడ్డులోని పల్లిపేట కూడలి వద్ద గురువారం పెళ్లి బృందంతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అదుపు తప్పి వెనుక టైర్లు మురుగుకాలువలో దిగబడ్డాయి. దీంతో ఒక్కసారిగా బస్సులో ఉన్న వారంతా హాహాకారాలు చేశారు. స్థానికుల సాయంతో బస్సు టైరు పైకి తీయడంతో కొద్ది నిమిషాల తరువాత పెళ్లి బృందం వెళ్లగలిగింది. పోలాకి నుంచి కొల్లివలసకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



దాసరి పోలారావు (ఫైల్)

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన దాసరి పోలారావు(48) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దాసరి పోలారావు మద్యం మత్తులో బుధవారం పొలాలకు వాడే కలుపు మందు తాగాడు. దీన్ని గమనించి కుటుంబ సభ్యులు తొలుత బుడితి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య అమరావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన



వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

టెక్కలి: టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సన్యాసిపేట గ్రామంలో వివాదాస్పద భూములను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం పరిశీలించారు. గ్రామంలో బంగారం బండి సంజీవరావు వారసులకు చెందిన భూములను గ్రామానికి చెందిన గిరిజనులు సాగు చేస్తున్నారు. అయితే ఆయా యజమానులు భూముల అమ్మకాలు చేసే విషయంలో ప్రస్తుతం సాగు చేస్తున్న గిరిజనులకు ప్రాధాన్యత కల్పించి ప్రభుత్వమే భూములను కొనుగోలు చేసి ఆదుకోవాలని గిరిజన రైతులు ఇటీవల కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోవడంతో ఆయా భూములను కలెక్టర్ పరిశీలించారు. భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓ సుదర్శన్ దొర, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, సర్వేయర్ సూర్యనారాయణతో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

తగ్గుముఖం దిశగా మహేంద్ర తనయ



పాతపట్నం వద్ద మహేంద్రతనయ నది ప్రవాహం

పాతపట్నం:

మహేంద్ర తనయ నదిలో ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు ఉద్ధృతంగా వరద నీరు వచ్చి చేరింది. వానలు తగ్గడంతో గురువారానికి ప్రవాహం తగ్గింది. పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న కాజ్‌వేపై నీరు పారడం తగ్గింది. దీంతో కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం రెండు గ్రామస్తులకు రాకపోకలు జరుగుతున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు పరామర్శ



గుంట సోమేశ్వరరావును పరామర్శిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు

టెక్కలి: టీడీపీ నాయకుల వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న శ్రీజగన్నాథపురం ఫీల్డ్ అసిస్టెంట్ గుంట సోమేశ్వరరావును గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజ్, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు కవిటి రామరాజు, చిన్ని జోగారావు, భూషణ్‌రెడ్డి తదితరులు బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల ఒత్తిళ్లకు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ తరఫున అండగా ఉంటామని బాధితుడికి భరోసా నిచ్చారు.

మబగాం చోరీ కేసులో బంగారం రికవరీ



చోరీ వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణ

పోలాకి: మబగాంలో ఈ నెల 2వ తేదీన జరిగిన చోరీ కేసులో బంగారాన్ని రికవరీ చేసినట్లు నరసన్నపేట సీఐ జెర్రిపోతుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పోలాకి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించారు. బాధితుడు రమణమూర్తి ఇంట్లో బీరువా పగలుగొట్టి 8 తులాల బంగారం చోరీ చేసినట్లు అతని భార్య గౌరి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏఎస్ఐ జగన్నాథం, సిబ్బంది వెంకటరమణ, చిన్నారావు, శంకర్ లతో కూడిన బృందం దర్యాప్తు చేశారు. సరిగ్గా 20రోజుల తరువాత నాగళ్ల నాగరాజు అనే పాత నేరస్తుడు ఆ బంగారాన్ని నరసన్నపేటలో తాకట్టు పెట్టేందుకు వస్తున్నపుడు సత్యవరం కూడలి వద్ద పోలీసులు పథకం ప్రకారం పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. చోరీ చేసిన వ్యక్తిని గుర్తించిన సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు చెప్పారు. ముద్దాయిని కోర్టులో హాజరు పరచనున్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

అరసవల్లి: జిల్లాలోని 912 పంచాయతీల్లో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహించేలా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒకేసారి జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ గ్రామ సభలు నిర్వర్తించాలని, ఈ సమావేశాలకు స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా హాజరుకానున్నారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావులు తెలియజేశారు. ఈ మేరకు గ్రామ సభలకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించగా మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరగాలని పేర్కొన్నారు. సమావేశాల్లో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు, కేటాయింపులపై చర్చించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధిలో చెరువు పనులు చేయాలని డిమాండ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉపాధి హామీ పథకం పనుల్లో వ్యవసాయ అనుబంధ పనులు చేర్చాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలంలు కోరారు. ఈ మేరకు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి వేతనదారులందరికీ పని కల్పించాలంటే జిల్లాలో ఉన్న అన్ని రకాల చెరువుల్లో పనులు చేయటానికి అవకాశం కల్పించాలన్నారు. మెటీరియల్ కోసం ఖర్చు పెట్టే నిధులు 90 శాతం మట్టి పనులకు కేటాయించాలని కోరారు.

ఉచిత ఇసుకపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఉచిత ఇసుక కార్యకలాపాలను సమర్థంగా అమలు చేసేందుకు పటిష్ఠ ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఇసుకపై ఫిర్యాదులకు 18004256012 టోల్ ఫ్రీ నంబర్, 9701691657 వాట్సాప్ నంబర్ 24 గంటలూ పనిచేస్తాయని చెప్పారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం కొత్తూరు మండలం అంగూరు వద్ద స్టాక్ యార్డ్ ఏర్పాటు చేశామని, అక్కడికి వచ్చే ట్రక్కుల్లోకి ఇసుకను లోడ్ చేయబోయే తేదీ, సమయాన్ని సరిగ్గా పేర్కొంటూ బుకింగ్ రశీదును జారీ చేస్తామని చెప్పారు. ప్రతి కేటగిరీ వాహనంపై కిలో మీటరుకు, మెట్రిక్ టన్నుకు రవాణా చార్జీలను ఖరారు చేశామన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా ఆర్టీవో కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని, రిజిస్ట్రేషన్ లేని వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి రవాణాదారులు ఎలాంటి ఉల్లంఘనలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక కార్యకలాపాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పర్యవేక్షించేందుకు స్టాక్ యార్డులకు సమీపంలో రెవెన్యూ/పోలీస్/పంచాయతీలతో కూడిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అంగూరు రీచ్ దగ్గరలో సోమరాజుపురంలో సచివాలయంలో బుకింగ్ కేంద్రం సిద్ధం చేశామని, ఈ బుకింగ్ కేంద్రంలో ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలని, ప్రతి స్లాట్‌లో రెండేసి గంటలకు సమయం కేటాయించి కనీసం 15 వాహనాలకు లోడింగ్ అనుమతి ఇస్తామని, బుకింగ్ కేంద్రం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే పని చేస్తుందన్నారు. రాత్రి వేళల్లో ఇసుక రవాణా నిషేధించామని స్పష్టం చేశారు.

లోడింగ్, ఇతర ఖర్చులు కలుపుకొని ఇసుకను టన్ను రూ.340 ధర నిర్ధారించినట్లు చెప్పారు. పది మెట్రిక్ టన్నులకు 10 కిలోమీటర్ల పరిధిలో రూ.1633 రవాణా చార్జీలను నిర్ణయించామని, 15 కిలోమీటర్ల పరిధికి రూ.2035, 20 కిలోమీటర్ల పరిధికి రూ.2438, 35 కిలోమీటర్ల పరిధికి రూ.3668 చొప్పున ధరను నిర్ధారించినట్లు వివరించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడం కోసం పైడిభీమవరంలో నిరంతరాయంగా పనిచేసేలాగా చెక్ పోస్టును ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో మైన్స్ ఉప సంచాలకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఆఫీసర్లమంటూ బెదిరించి..

- స్వీటు దుకాణ యజమానికి రూ. 2 లక్షలకు టోపీ

శ్రీకాకుళం క్రైమ్ : జీఎస్టీ అధికారులమంటూ బెదిరించిన కొందరు వ్యక్తులు ఓ స్వీట్ షాప్ ఓనర్ వద్ద రూ.2 లక్షలు కాజేశారు. దీంతో బాధితుడు మూడు రోజుల కిందట రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. నగరంలోని రెండో పట్టణ పరిధి రాయివీధిలో రాయపురెడ్డి చంద్రశేఖర్ అనే దళిత వ్యక్తి భార్య, కుమారునితో నివసిస్తున్నాడు. వీధికి సమీపంలోనే మరో ముగ్గురితో కలసి ఓ స్వీటు దుకాణం నడుపుతున్నాడు. ఈనెల 18న తిత్తి ప్రవీణ్, మణికంఠ అనే ఇద్దరు వ్యక్తులు దుకాణం వద్దకు వచ్చి తాము జీఎస్టీ ఆఫీసర్లమని, ఈ షాపు నడిపేందుకు లైసెన్స్ ఎక్కడిదని ప్రశ్నించారు. మీ వద్ద ఎలాంటి లైసెన్సులు లేవని, షాపు మూసేస్తామని బెదిరించారు.

అంతేకాక బలవంతంగా చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కొని రూ. 15 లక్షలు తెమ్మని ఒత్తిడి చేశారు. అదే సమయంలో మీడియా పేరు చెప్పుకుని తిరిగే రవికుమార్ అనే వ్యక్తి వచ్చి మధ్యలో కలగజేసుకున్నాడు. వచ్చిన వాళ్లు జీఎస్టీ అధికారులేనంటూ చెప్పి.. సెటిల్ చేసుకోవాలని సూచించాడు. ఆఖరుకు రూ.5 లక్షలు కట్టాలని ముగ్గురూ కలిసి డిమాండ్ చేశారు. చివరికి రూ. 3 లక్షలకు ఒప్పుకోగా వెంటనే కట్టమని ఒత్తిడి చేయగా భార్య డెలివరీ కోసం దాచుకున్న రూ. 2 లక్షల సొమ్మును తెచ్చి ఇచ్చేశాడు. చివరిలో వెళ్తూ వెళ్తూ.. ఈ విషయం ఎవరికైనా చెబితే నీకే ప్రమాదమని హెచ్చరిస్తూ వెళ్లిపోయారు. బంధువుల వద్ద జరిగిన విషయం చెప్పిన చంద్రశేఖర్ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు చేశాక కూడా ఈ విషయం సెటిల్ చేసేందుకు చాలా ప్రయత్నాలు జరిగాయి. చివరికి ఈ విషయం గురువారం రాత్రి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దృష్టికి వెళ్లడంతో సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. మీడియా పేరు చెప్పుకుని ఇలాంటి అవినీతి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు.